క్లుప్తంగా

షిర్డీసాయి ఆశ్రమంలో ఎమ్మెల్యే పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కిరణ్

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని సంత సీతారాంపురంలోని షిర్డీసాయి ఆశ్రమం వార్షికోత్సవంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం పాల్గొన్నారు. సాయినాథునికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి దాసాంజనేయ ఆలయ పునఃప్రతిష్టాపన ఉత్సవాలు



దాసాంజనేయస్వామి ఆలయం

గార: మండలంలోని కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం) పంచాయతీ చిన్న మత్స్యలేశంలో నిర్మించిన దాసాంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్టాపన మహోత్సవాలు బుధవారం నుంచి వైభవంగా జరగనున్నాయని కెప్టెన్ మైలపిల్లి జనార్దన్, సోదరులు తెలిపారు. ఉదయం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, సాయంత్రం అరసవల్లి సూర్యదేవాలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో తిరువీధి మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఐదో తేదీన విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు.

బృందావనంలో అష్టమి వేడుకలు

గార: మండలంలోని జొన్నలపాడు కాలనీ సమీపంలోని బృందావనంలో బహుళ అష్టమి సందర్భంగా మంగళవారం శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌదరి దుర్గారావు దంపతులు తొలి పూజలు చేయగా పలువురు భక్తులు పాల్గొన్నారు. లావణ్య, డీసీసీబీ మేనేజర్ రమేష్, అప్పలరాజు, సింహాద్రి శ్రీనివాసరావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ మాస్టర్ వారణాసి సందీప్, కళింగపట్నం శర్వాణి, యోదిత, రఘురామ్, రమేష్, శ్రీనివాస్, చౌదరి శ్రీనివాస్‌లు భక్తిగీతాలు ఆలపించారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించాలి



బందరువానిపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

గార: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు కోరారు. మంగళవారం బందరువానిపేటలో యువత, మహిళలు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, ఎవరు గొడవలు పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.కృష్ణప్రసాద్, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ పునఃప్రతిష్టాపన పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేటలో రంగనాయకీ గోదా సమేత రంగనాథ స్వామి ఆలయ పునఃప్రతిష్టాపన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. గత నెల 31న ప్రారంభమైన ఈ పూజలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 4న చిన్నజీయర్ స్వామి సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. బుధవారం అహోబల జీయర్ స్వామి పూజలు నిర్వహిస్తారు. మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సేవా ట్రస్టు అధ్యక్షుడు, సీఐ పైడి రంగనాథం, కోశాధికారి సూర శ్యామలరావు, సెక్రటరీ పైడి రామన్న, జాయింట్ సెక్రటరీ పైడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కన్వర్జ్ ఫెస్ట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో బుధ, గురువారాల్లో కన్వర్జ్ 2కే 24 టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు తెలిపారు. విద్యా, సాంకేతిక అంశాలపై రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

పింఛన్ పాపం చంద్రబాబుదే

- టీడీపీకి అధికారమిస్తే పథకాల్లో కోత తప్పదు
- రజకుల ఆత్మీయ సమావేశంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



రజకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అవ్వాతాతలకు పింఛను అందనివ్వకుండా చేసిన పాపం చంద్రబాబుదేనని, ఆయన బినామీ సంస్థ ఒకటి ఈసీకి ఫిర్యాదు చేసిన ఫలితంగానే ఇవాళ వలంటీర్ల ద్వారా పింఛన్లు ఒకటో తారీఖుకు అందని పరిస్థితి నెలకొందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో మంగళవారం రజకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాబుకు అధికారం ఇస్తే ఇలానే ప్రభుత్వ పథకాలను గాలికొదిలేసి తన స్వార్థం చూసుకుని ప్రజా ప్రయోజనాల్ని పట్టించుకోరని దుయ్యబట్టారు. అనేక సందర్భాల్లో వలంటీర్లను చంద్రబాబు తిట్టారని, సంఘ విద్రోహ శక్తులుగా పేర్కొన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే వలంటీరు వ్యవస్థను తొలగించనని, కొనసాగిస్తానని దొంగమాటలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను అమలు చేసిన సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు.

అన్ని కులాలకు సమ ప్రాధాన్యం..

మారుతున్న సమాజంలో కొన్ని వృత్తులు నిరాదరణకు గురయ్యాయని, అన్ని కులాలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సముచిత ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఒక కులంలో పుట్టిన వారి పిల్లలు అదే వృత్తికి పరిమితం కాకూడదన్న ఆలోచనతో ప్రభుత్వ బడుల్లో మంచి చదువుతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. ఇన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు అమలు చేస్తుంటే టీడీపీ నేత లోకేశ్ కనీస అవగాహన లేకుండా మాట్లాడటం బాధాకరమన్నారు. చంద్రబాబు, పవన్‌లు పక్క రాష్ట్రాల్లో ఉంటూ ఇక్కడ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు కుటుంబమంతా ఒక చోట కూర్చొని 14 ఏళ్ల పాలనలో ప్రజలకు ఏమిచ్చారో.. ఈ ఐదేళ్లలో సీఎం జగన్ ఏమిచ్చారో ఒక్కసారి ఆలోచించండని కోరారు. రజకులను కానీ ఇంకా ఏ ఇతర కులస్తులనైనా చులకన చేస్తే వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మీ సామాజిక ఉన్నతికి ఎవరు కారణమయ్యారో ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, కుప్పిలి సూర్యారావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు కె.శ్రీనివాస్, రాష్ట్ర బీసీసెల్ నాయకులు నగవరపు రాజు, కంచెర్ల అరుణ, గండేపల్లి విజయ బాబు, పట్టణ అధ్యక్షులు కురిటి అప్పారావు, సునురు నర్సింహులు, చిట్టివలస గణేష్, జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌత్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబాలతో హాజరైన రజకులు

2.50 లక్షల ఉద్యోగాలిచ్చాం

- చంద్రబాబు దుష్ప్రచారాలను ప్రజలు నమ్మరు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



దండివీధిలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఆలోచనతోనే పారదర్శకంగా సచివాలయ ఉద్యోగాలు, వివిధ శాఖల్లో 2.50 లక్షల ఉద్యోగాలిచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. టీడీపీ హయాంలో ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా.. నిరుద్యోగ భృతి సక్రమంగా చెల్లించారా అని ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలోని దండివీధిలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్యాలెస్‌లో ఉంటూ ప్రజలు ఏమీ చెయ్యరని చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారాలు చేసినంత మాత్రాన ప్రజలెవ్వరూ నమ్మరన్నారు. నిరంతరం పేద ప్రజల అభివృద్ధికే సీఎం జగన్ ఆలోచన చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి, సంక్షేమాన్ని చెప్పడం చేతకాని ఈటీవీ, ఏబీఎన్, టీవీ-5లు చంద్రబాబు అబద్ధపు పాలనను జనాలకు నమ్మించాలనే ప్రయత్నం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యలో మొదటి స్థానంలో ఉన్న కేరళ రాష్ట్రం సరసన నిలపాలన్నదే వైఎస్సార్ సీపీ లక్ష్యమన్నారు. విశాఖలో రాజధాని నిర్మిస్తామంటే టీడీపీ నేతలకు ఎందుకంత భయమో తెలియడం లేదన్నారు. అమరావతిలో రాజధాని పేరుతో వేలాది ఎకరాలు సేకరించి రియల్ వ్యాపారం చేసుకున్నారని దుయ్యబట్టారు. 2014 నుంచి 2019 వరకు వృద్ధి రేటు గణాంకాలు, ఈ ఐదేళ్లలో గణాంకాలు చూస్తే ఏ స్థాయిలో అభివృద్ధి జరిగిందో తెలుస్తుందన్నారు. శ్రీకాకుళం నగరంతోపాటు జిల్లా, రాష్ట్రం మరింత అభివృద్ధి జరగాలని భావిస్తే వైఎస్సార్‌సీపీ ఫ్యాన్‌గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఎం.వి.పద్మావతి, ఎం.వి.స్వరూప్, చౌదరి సతీష్, సాధు వైకుంఠరావు, పొన్నాడ రుషి, కర్నేన పద్మావతి, కర్రి రంగాజీదేవ్, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, గంగాధర్, నీలాద్రి, జేఎం శ్రీనివాస్, బిర్లంగి రామ్మోహన్, సుంకరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన గార ఎంపీడీఓ కల్యాణి

గార: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎండల తీవ్రత దృష్ట్యా గారతో పాటు అన్ని సచివాలయాల పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ బి.కల్యాణి తెలిపారు. ఈ మేరకు గార మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఉమ, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సంచాంలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రమణమూర్తి

రణస్థలం: వేసవి దృష్ట్యా ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి గ్రామ సచివాలయ సమీపంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి తెలిపారు. సంచాం గ్రామంలో మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి హైదర్ అలీ బేగ్, వీఆర్వో బలివాడ శంకర్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా, కరజాడ, సింగుపురం గ్రామాల్లో మంగళవారం ఓటు హక్కు ఆవశ్యకతను వివరిస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుజాత, సీసీలు పాల్గొన్నారు.

ప్రమాణాలతో కూడిన విద్య అవసరం

శ్రీకాకుళం న్యూకాలనీ: విలువలతో కూడిన విద్యతో పాటు పోటీప్రపంచంలో నిలదొక్కుకునేలా ప్రమాణాలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిరం వేదికగా మంగళవారం సాయిప్రియదర్శిణి ఎడ్యుకేషన్ సొసైటీవారి విశాఖ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో విశాఖ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ కె.మధుసూదన్, విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుంట తులసీరావు, విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, ఐతమ్ కాలేజ్ డీన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, చైతన్య, ఎం.మల్లేశ్వరరావు, జి.రోజారాణి, హెచ్ఎం పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు

సచివాలయ సేవలపై ఆరా



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రణస్థలం: మండల వ్యాప్తంగా 11,560 పింఛన్ల పంపిణీ శతశాతం జరగాలని ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి అన్నారు. కోటపాలెం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్ పాల్గొన్నారు.

గణిత అధ్యాపకులకు సత్కారం

శ్రీకాకుళం న్యూకాలనీ: దైనందిన జీవితంలో గణితం భాగంగా మారిందని జిల్లా ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మ్యాథ్స్ లెక్చరర్లగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వెంకటరావు(2021), కృష్ణమూర్తి (2023)లను మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల గణిత విభాగంలో సత్కరించారు.జిల్లా ఇంటర్ పబ్లిక్ పరీక్షలను, స్పాట్ వాల్యుయేషన్‌ను విజయవంతంగా పూర్తి చేయడంలో కీలక భూమిక పోషించిన ఆర్ఐఓను సైతం సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత లెక్చరర్ దయానంద్, జనరల్-1 జి.వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, రమేష్, రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రవీణ్, మోహన్, ఉమామహేష్, రోజా, కొయ్యాన రామారావు పాల్గొన్నారు.



ఆర్ఐఓను సత్కరిస్తున్న లెక్చరర్లు

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్ : ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జేఆర్‌పురం సీఐ జి.రామచంద్రరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇబ్రహింబాద్‌లో కేంద్ర భద్రత బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల్లో పటిష్ట భద్రత కల్పిస్తున్నామని, నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిసెట్ - 2024కు ఉచిత కోచింగ్ అందజేసి స్టడీ మెటీరియల్ కూడా అందజేయనున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్ రావు, పాలిసెట్ సెట్ జిల్లా కన్వీనర్ పి.యుగంధర్ రావు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఐదు ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయని చెప్పారు. ఈ నెల 27న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ కొనసాగుతోందని, శ్రీకాకుళం, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సహాయ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డు, 10వ తరగతి హాల్ టిక్కెట్ ఆధారంగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 1 నుంచి ఉచిత కోచింగ్ ప్రారంభమైందని, ఈ నెల 25 వరకు కోచింగ్ ఉంటుందని తెలిపారు. వారాంతపు మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గణితం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9912342008 నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.



పాలిసెట్ స్టడీ మెటీరియల్ ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు, కన్వీనర్ పి.యుగంధర్‌రావు

కేజీబీవీ పరిశీలన

ఎచ్చెర్ల: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు మరింత ఉత్తమ ఫలితాలు సాధించేలా సిబ్బంది కృషిచేయాలని కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌డీవీ రమణ అన్నారు. జీసీడీవో ఎస్.నీరజతో కలిసి మంగళవారం లావేరు మండలం మురపాక కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పరికరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. పాఠశాల నిర్వహణ బాగానే ఉందని, ఇదే స్ఫూర్తితోమరింత అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.సుధా, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీడీ ఎస్.డి.వి.రమణ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల: లావేరు మండలం బెజ్జిపురం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం నగరానికి చెందిన వ్యక్తి అరటికట్ల అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బొందిలీపురం వీధికి చెందిన అశోక్ విజయనగరం లెండి కాలేజీలో ప్రైవేటు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. బైక్‌పై కాలేజీకి వెళ్తుండగా బెజ్జిపురం వద్ద ఆగి ఉన్న అరబిందో బస్సు వద్ద సడెన్ బ్రేక్ వేశారు. ఈ ఘటనలో రోడ్డుపై బోల్తాపడటంతో తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



ఫ్యాన్ గుర్తును చూపిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. మంగళవారం లావేరు మండలం తాళ్లవలస, గురుగుబిల్లి, చిగురుకొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రచారం చేపట్టి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, సర్పంచ్ ప్రతినిధి దేశెట్టి తిరుపతిరావు, ఎంపీటీసీ ప్రతినిధి మీసాల శ్రీనివాసరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎన్నికల నిబంధనలను అతిక్రమించవద్దు'



ఆర్టీసీ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న డీపీటీవో విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి కూడా ఎన్నికల నిబంధనలను అతిక్రమించకుండా చూసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం రెండో డిపో గ్యారేజీ ఆవరణలో మంగళవారం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లతో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నియమ, నిబంధనలను ప్రతి ఒక్కరూ పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. రాజకీయ నాయకులు నిర్వహించే ఎలాంటి ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొనరాదన్నారు. రాజకీయ ప్రచారాలకు సంబంధించి పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలను బస్సులకు అతికించకుండా చూసుకోవాలన్నారు. విధినిర్వహణలో ఉన్నపుడు, విధి నిర్వహణ అనంతరం రాజకీయ నాయకులు నిర్వహించే సభలు, సమావేశాలు, చర్చలు తదితర వాటిల్లో పాల్గొనకుండా ఉండాలన్నారు. ప్రతి ఉద్యోగి ప్రవర్తన రాజకీయాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఏ రాజకీయ పార్టీ నుంచైనా ప్రయోజనం, బహుమతి తదితరవి ఆశించినా, ప్రభావితం చేసేందుకు ప్రయత్నించినా ఎన్నికల నియమ నిబంధనలను అతిక్రమించడమేనన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు మల్లిఖార్జునరాజు, కెఆర్ఎస్ శర్మ, ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కార్యసిద్ధి ఆంజనేయుడికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని ఫాజుల్‌బాగ్‌పేటలోని చిం దత్తనాథ క్షేత్రంలో సంజీవనీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగాతరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

విజయ గణపతికి విశేష పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని అలంకరించారు.

కవి సమ్మేళనానికి కుప్పిలికి ఆహ్వానం

ఆమదాలవలస: మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఉగాది సందర్భంగా నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు తనకు ఆహ్వానం అందిందని ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావుకు మంగళవారం తెలిపారు. ఈ నెల 5న చెన్నై యూనివర్సిటీలో జరిగే సాహిత్య సదస్సుకు దేశవ్యాప్తంగా 60 మంది కవులకు ఆహ్వానం పంపారన్నారు.